సాక్షి
కామారెడ్డి
మంగళవారం । 14 । మార్చి । 2023



ప్రజావాణికి 35 ఫిర్యాదులు
కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో 35 ఫిర్యాదులు నమోదయ్యాయి. ఇందులో రెవెన్యూకు సంబంధించినవే అధికం..
- 8లో ▸



సిద్దరామేశ్వరుడి కల్యాణం
భిక్కనూరులోని సిద్దరామేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
36.9 /16.2

వాతావరణం
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

‘డబుల్’ లక్కెవరిదో?

- జిల్లా కేంద్రంలో 720 ఇళ్ల పంపిణీకి ఏర్పాట్లు
- దరఖాస్తులు 5,047.. అర్హులు 3,450 మంది
- నేడు డ్రా పద్ధతిన లబ్ధిదారుల ఎంపిక

జిల్లాకేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను పంపిణీ చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే దరఖాస్తులు ఎక్కువగా రావడం, నిర్మించిన ఇళ్లు తక్కువగా ఉండడంతో డ్రా పద్ధతిన లబ్ధిదారులను ఎంపిక చేయాలని నిర్ణయించారు. మంగళవారం డ్రా నిర్వహించనుండడంతో దరఖాస్తుదారుల్లో ఉత్కంఠ నెలకొంది.



కామారెడ్డి ఇందిరానగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయం

సాక్షి, కామారెడ్డి: కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరానగర్, టేక్రియాల్, ఇల్చిపూర్, రామేశ్వర్‌పల్లి, దేవునిపల్లి తదితర ప్రాంతాలలో 720 డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించారు. నిర్మాణాలు ఎప్పుడో పూర్తయినా మౌలిక సదుపాయాలు లేక పోవడంతో చాలా కాలంగా పెండింగ్‌లో పెడుతూ వస్తున్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్లను పంపిణీ చేయడానికి ఇటీవల జిల్లా యంత్రాంగం కసరత్తు చేసింది. పేదలనుంచి దరఖాస్తులను ఆహ్వానించిన అధికారులు.. సమగ్ర కుటుంబ సర్వే డేటా ఆధారంగా అర్హుల జాబితా రూపొందించారు. పట్టణంలో ఇళ్ల కోసం 5,047 మంది దరఖాస్తు చేసుకోగా అందులో 3,450 మందిని అర్హులుగా గుర్తించారు. నిర్మాణం పూర్తయిన 720 ఇళ్లకు సంబంధించి డ్రా నిర్వహించి, లబ్ధిదారులను ఎంపిక చేయాలని నిర్ణయించారు.

ఐదుగురిలో ఒకరికే ఇల్లు!
పట్టణంలో నిరుపేదలు వేలాది మంది డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ చాలామంది కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి వచ్చి వినతులు సమర్పిస్తున్నారు. ఏళ్లు గడుస్తున్నా ఎంతకీ పంపిణీ చేయకపోవడంతో విసిగిపోయి ఆందోళనలు కూడా చేశారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీ చేపట్టాలని డిమాండ్ చేస్తూ గతంలో బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. ఎట్టకేలకు ఇళ్లను పంపిణీ చేయాలని ఇటీవల అధికారులు నిర్ణయించారు. ప్రభుత్వ మార్గనిర్దేశాల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మాజీ సైనికులు, మైనారిటీ వర్గాలకు నిర్దేశిత నిష్పత్తి ప్రకారం ఇళ్లు కేటాయిస్తామని అధికారులు తెలిపారు. అయితే అర్హులైన పేదలు ఎక్కువ మంది ఉండగా, నిర్మాణం పూర్తయిన ఇళ్లు తక్కువగా ఉండడంతో ఎవరి సొంతింటి కల నెరవేరుతుందో అన్న అంశంపై ఉత్కంఠ నెలకొంది. వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తే ఒక్కో ఇంటికి దాదాపు ఐదుగురు పోటీ పడుతున్నట్లు స్పష్టమవుతోంది. కాగా ఇల్లు ఇప్పిస్తామంటూ ఇప్పటికే దళారులు అమాయకుల వద్దనుంచి డబ్బులు దండుకున్నారన్న ఆరోపణలున్నాయి. అయితే అధికారులు డ్రా పద్ధతిన లబ్ధిదారులను ఎంపిక చేయనుండడంతో ఇల్లు దక్కే అదృష్టవంతులెవరో అన్న విషయమై చర్చ జరుగుతోంది.

డ్రా నిర్వహించే స్థలాలు

వార్డులు	వేదిక
3, 4, 25	అయ్యప్ప ఫంక్షన్ హాల్, సిరిసిల్లరోడ్డు
26, 27	గంజ్ మార్కెట్ కమిటీ
5, 29, 30	హసన్ ఫంక్షన్ హాల్, కిష్టమ్మ గుడి దగ్గర
28, 31, 47	ఎన్ఆర్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్, భవానీరోడ్
6, 7, 8, 32	ఆర్అండ్‌బీ ఓల్డ్ గెస్ట్ హౌజ్
14, 33, 34, 36, 37	సీనియర్ సిటిజెన్స్ బిల్డింగ్
38, 39, 40	వరలక్ష్మి గార్డెన్, అశోక్‌నగర్
15, 16, 17	పంచాయతీరాజ్ డీఈ ఆఫీస్
18, 19, 41	లిమ్రా ఫంక్షన్ హాల్, సైలానీబాబా కాలనీ
42, 43	భూపుత్రమ్మ కల్యాణ మండపం
48, 49	పంచముఖి హనుమాన్ టెంపుల్
20, 21, 24	ఆమేటి కిష్టయ్య ఫంక్షన్ హాల్
22, 23	రాజీవ్‌నగర్ పీహెచ్‌సీ
44, 45, 46	సొసైటీ కార్యాలయం, గడీ రోడ్
9, 10, 11, 12, 35	మున్నూరుకాపు సంఘం, దేవునిపల్లి
1, 2	పాత గ్రామ పంచాయతీ, అడ్లూర్
2	పాత గ్రామ పంచాయతీ, రామేశ్వర్‌పల్లి
13	పాత గ్రామ పంచాయతీ, టేక్రియాల్

దరఖాస్తుదారులు హాజరవ్వాలి

డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం మంగళవారం డ్రా తీయనున్నట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. ఈ అంశంపై సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించే డ్రాకు దరఖాస్తుదారులు హాజరయ్యేలా చూడాలన్నారు. ఉదయం 9 గంటలకే డ్రా ప్రారంభించాలన్నారు. రిజర్వేషన్ కేటగిరీలకు సంబంధించి ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రంలోని కళాభారతిలో డ్రా తీస్తామన్నారు. మిగతా వార్డులకు సంబంధించి ఎంపిక చేసిన ప్రదేశాల్లో ఉదయం 10.30 గంటలకు డ్రా ఉంటుందని పేర్కొన్నారు. డ్రా ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రమోహన్, ట్రైనీ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి’



దోమకొండ: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాషాయ జెండా ఎగురవేయడానికి కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం గొట్టిముక్కులలో వన్‌డే వన్ బూత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు ప్రజల సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ పాలన పూర్తిగా అవినీతిమయంగా మారిందన్నారు. కేంద్రంలో ఎనిమిదిన్నరేళ్లుగా అవినీతి రహిత పాలన సాగుతోందని, దానిని ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, మండల అధ్యక్షుడు రాజేష్, శక్తి కేంద్రం ఇన్‌చార్జి రవీందర్‌రెడ్డి, నాయకులు మధు, భూపాల్‌రెడ్డి, యశ్‌పాల్‌రెడ్డి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పోచారం నీటివిడుదల



నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టు నుంచి సోమవారం నాలుగో విడత నీటి విడుదల చేపట్టారు. 250 క్యూసెక్కుల చొప్పున ప్రధాన కాలువకు విడుదల చేస్తున్నారు. 15 రోజుల పాటు నీటిని విడుదల చేయనున్నట్లు నీటిపారుదలశాఖ ఏఈ శ్రీకాంత్ తెలిపారు. ఆయకట్టు రైతులు నీటిని వృథా చేయకుండా సక్రమంగా ఉపయోగించుకోవాలన్నారు.

న్యూస్‌రీల్

హాకీ రాష్ట్ర జట్టుకు ఎంపిక



కామారెడ్డి రూరల్: మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తిలో జరిగిన తెలంగాణ సౌత్ జోన్ జూనియర్స్ హాకీ నేషనల్ సెలక్షన్స్‌లో జిల్లాకు చెందిన క్రీడాకారిణి సత్తా చాటి రాష్ట్ర జట్టుకు ఎంపికైంది. ఈ విషయాన్ని జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు లింగం, ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి, కోశాధికారి మధుసూదన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదాశివనగర్ మండలం కుప్రియాల్ గ్రామంలో తొమ్మిదో తరగతి చదువుతున్న శ్రావ్య రాష్ట్ర జట్టుకు ఎంపికైందని పేర్కొన్నారు. ఈనెల 15 నుంచి 26 వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రం మధురైలో జరిగే జాతీయ స్థాయి హాకీ టోర్నీలో ఆమె పాల్గొంటుందని తెలిపారు.

5,207 మందికి కంటి పరీక్షలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో కంటివెలుగులో భాగంగా సోమవారం 5,207 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 684 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 1,97,801 మందికి కంటి పరీక్షలు చేసి, 31,671 మందికి అద్దాలను అందించామని వైద్యాధికారులు తెలిపారు.

వ్యక్తిగత కారణాలతోనే జీపీ కార్మికుడి ఆత్మహత్య

కామారెడ్డి క్రైం: వ్యక్తిగత కారణాలతోనే బీబీపేట పంచాయతీ కార్మికుడు కొంగరి బాబు(32) ఆత్మహత్యకు పాల్పడ్డాడని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీపీలో మల్టీపర్పస్ వర్కర్‌గా పనిచేసే బాబు రెండు నెలలుగా జీతం రాకపోవడంతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రచారం జరిగిందని పేర్కొన్నారు. అది నిజం కాదని, బాబుకు ఫిబ్రవరి వరకు ప్రతినెలా జీతం చెల్లించామని వివరించారు. పోలీసుల విచారణలోనూ అదే తేలిందని పేర్కొన్నారు. వ్యక్తిగత కారణాలతోనే బాబు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారని తెలిపారు.

ఎన్ఎంసీ బృందం పరిశీలన



కామారెడ్డి టౌన్: నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) బృంద సభ్యులు శివప్రసాద్, శివ, పద్మావతి సోమవారం కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని విభాగాలను తనిఖీ చేశారు. భవనం పైఅంతస్తులో నిర్మిస్తున్న అదనపు బెడ్ల భవనాన్ని పరిశీలించారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ పెరుగు వెంకటేశ్వర్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అక్కడి నుంచి దేవునిపల్లి వెళ్లారు. ఎంసీహెచ్ భవనంలో ఏర్పాటు చేస్తున్న మెడికల్ కళాశాల భవనాన్ని పరిశీలించారు. కళాశాలకు సంబంధించిన ప్రొఫెసర్‌లు, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు, సీనియర్ రెసిడెన్స్ వివరాలను తెలుసుకున్నారు. భవనాల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మెడికల్ కళాశాలకు సంబంధించిన నివేదికను కౌన్సిల్‌కు అందిస్తామన్నారు. వారివెంట డీసీహెచ్ఎస్ విజయలక్ష్మి, ఆర్ఎంవో శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

‘ఆహార భద్రత’తో ఆరోగ్యకర జీవితం



భిక్కనూరు: ప్రజలు ఆరోగ్యకర జీవితాన్ని పొందేందుకు ఆహార భద్రత చట్టం దోహదపడుతుందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ కొమ్ముల తిర్మల్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన భిక్కనూరులోని తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో ఎంఎస్ డబ్ల్యూ విద్యార్థులు, చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లతో సమావేశమయ్యారు. అంగన్‌వాడి కేంద్రాల ద్వారా బాలింతలు, గర్భిణులకు అందుతున్న పౌష్టికాహారం గురించి తెలుసుకున్నారు. ఎంఎస్‌డబ్ల్యూ విద్యార్థులకు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయనను సౌత్ క్యాంపస్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ లక్కిరాజు హరిత ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రమ్య, డీపీఎం సుధాకర్, సౌత్‌క్యాంపస్ అధ్యాపకులు లలిత, అంజయ్య, యాలాద్రి, నరసయ్య, నారాయణ, దిలీప్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

‘దొరల గడీలో తెలంగాణ బందీ’



మాట్లాడుతున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్: తెలంగాణ రాష్ట్రం కేసీఆర్‌లాంటి దొరల గడీలో బందీ అయ్యిందని మాజీ మంత్రి షబ్బీర్ అలీ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్, బీజేపీల నుంచి పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అంతకుముందు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని కేవీఎస్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సభలో షబ్బీర్ అలీ మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులను పూర్తిగా విస్మరించిన కేసీఆర్ నియంత పాలన సాగిస్తున్నారన్నారు. నిరుద్యోగ భృతి ఊసే లేదని, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు మంజూరు చేయడం లేదని ఆరోపించారు. దీంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో గెలిచేది కాంగ్రెస్ పార్టీయేనని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజనీకుమార్ పేర్కొన్నారు. కామారెడ్డిలో షబ్బీర్ అలీని గెలిపించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షులు చంద్రకాంత్ రెడ్డి, నాయకులు ముకుందం, భీంరెడ్డి, గణేష్ నాయక్, గూడెం శ్రీనివాస్‌రెడ్డి, అనంతరెడ్డి, యాదవరెడ్డి, నర్సాగౌడ్, అశోక్ రెడ్డి, పాత శివకృష్ణమూర్తి, అన్వర్ అహ్మద్, ఐరేని సందీప్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్



చెక్కులు అందిస్తున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

సాక్షి, కామారెడ్డి: బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన ఐదుగురు బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు మంజూరైన బీమా చెక్కులను సోమవారం కామారెడ్డిలోని తన ఇంటి వద్ద అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్, మాచారెడ్డి జెడ్పీటీసీ మిన్కూరి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ.. వసతుల లేమి?

- కొనసాగుతున్న పనులు
- టెంట్లు, ఫస్ట్‌ఎయిడ్ కిట్లు కరువు
- పట్టించుకోని ఈజీఎస్ అధికారులు




గాలీపూర్ కుంటలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

నిజాంసాగర్: వలసల నివారణ కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకంలో కూలీలకు వసతులు కరువయ్యాయి. ఎండల్లో అటవి ప్రాంతాలు, చెరువులు, కుంటల్లో కందకాల తవ్వకం, పూడికతీత పనులు చేస్తున్న కూలీలు భానుడి ప్రతాపాన్ని తట్టుకోలేకపోతున్నారు. కనీసం టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు, తాగునీటి సదుపాయం లేకపోవడంతో కూలీలు ఇబ్బంది పడుతున్నారు.

జిల్లాలో 2,58,096 కుటుంబాలు జాబ్‌కార్డులు కలిగి ఉన్నాయి. వాటిలో 5,05,255 మంది కూలీలు పేర్లు నమోదు చేయించుకున్నారు. ప్రస్తుతం ఎండలు ముదురుతుండడంతో ఇబ్బందులు పెరిగాయి. అయితే గతంలో ఉపాధి పనులు జరిగే చోట ప్రథమ చికిత్స కిట్లు, ఎండాకాలంలో సేద తీరేందుకు టెంట్లు, తాగునీటి వసతి కల్పించేవారు. నాలుగైదేళ్లుగా ఆయా సౌకర్యాలను కల్పించడం లేదు. గడ్డపారలు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్ల సరఫరా నిలిపి వేయడంతో కూలీలు ఇబ్బందిపడుతున్నారు.


పనికి దూరమవుతున్న కూలీలు..
జిల్లాలో ఉపాధి హామీ పథకంలో భాగంగా చెరువులు, కుంటల్లో పూడికతీత, కట్టల బలోపేతం పనులు, అడవుల్లో కందకాల తవ్వకం పనులు నడుస్తున్నాయి. ఎండలు ముదురుతుండడం, పనిస్థలంలో వసతులు లేకపోవడంతో చాలామంది ఉపాధి పనులపై ఆసక్తి చూపడం లేదు. జిల్లాలో 5,05,255 మంది కూలీలు ఉండగా గత వారం 17,159 మంది మాత్రమే ఉపాధి పనుల్లో పాల్గొన్నారు. పనిచేసే చోట వసతులు కల్పిస్తే కూలీల సంఖ్య పెరిగే అవకాశాలున్నాయి.

టెంట్‌లు లేవు..



పని ప్రదేశంలో టెంట్ వేయలేదు. కనీసం తాగేందుకు నీళ్లు కూడా దొరకడం లేదు. పొద్దున్నే పనికి పోతే మధ్యాహ్నం రెండు, మూడు వరకు ఎండలోనే ఉండాల్సి వస్తోంది. సౌకర్యాలు కల్పించాలి.
– విఠల్, ఉపాధి కూలీ, గాలీపూర్

పైసలు పడ్తలేవు



ఉపాధి హామీ పథకంలో కూలి పైసలు సరిగా పడ్తలేవు. ఏడాదంతా పని చేస్తే మూడు వేల రూపాయలు కూడా వస్తలేవు. ఆ పైసల కోసం కూడా నెలల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది. పనికి తగ్గట్టుగా పైసలు ఇస్తే బాగుంటుంది.
– కానపురం లక్ష్మి, ఉపాధి కూలీ, గాలీపూర్

రైతులు హక్కులు సాధించుకోవాలి

- షుగర్ ఫ్యాక్టరీని మూసివేసిన ఘనత కేసీఆర్‌దే
- సీఎంకు మంత్రి ప్రశాంత్‌రెడ్డి కట్టుబానిస
- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



పాదయాత్ర చేస్తున్న రేవంత్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఈరవత్రి అనిల్, సీతక్క

మోర్తాడ్: వ్యవసాయం పండుగలా మారాలంటే హర్యానా, పంజాబ్ రైతుల స్ఫూర్తితో పోరాడి హక్కులు సాధించుకోవాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఇక్కడి రైతులకు పిలుపునిచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో చెరుకు పరిశ్రమలను నడిపిస్తే తెలంగాణ వచ్చిన తర్వాత వాటిని మూసివేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. చక్కెర ఫ్యాక్టరీని తెరిపించుకోవడానికి రైతులు పోరాటం చేయాల్సి ఉందన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా సోమవారం ఏర్గట్ల మండల కేంద్రంలో కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ మేం రైతులతో సమావేశాన్ని నిర్వహిస్తే రైతులు రాకుండా ఒక సన్నాసి బెదిరించారని తెలిసిందన్నారు. అయినా రైతులు బెదరకుండా సమావేశానికి రావడం విశేషమన్నారు. కవితను ఓడించి కల్వకుంట్ల కుటుంబాన్ని పాతర వేసిన చరిత్ర ఈ ప్రాంతానికి ఉందని పేర్కొన్నారు. పసుపు బోర్డు తెస్తానని ఎంపీ అర్వింద్ ఇక్కడి రైతులను మోసం చేశారని విమర్శించారు. బాండ్ పేపర్ రాసి ఇచ్చి మాట తప్పిన ఆయనను పొలిమేరలకు తరమాల్సిన అవసరం ఉందన్నారు. కేసీఆర్‌కు కట్టు బానిసగా బతుకుతున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఫాంహౌజ్‌లో పని చేస్తూ ఏ ఒక్కరోజు కూడా మంత్రిగా వ్యవహరించలేదని ఎద్దేవా చేశారు. గృహ నిర్మాణ మంత్రిగా ఉన్న ప్రశాంత్‌రెడ్డి తనను గెలిపించిన ప్రజలకు ఒక్క డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇవ్వలేకపోయారని అన్నారు. సిద్దిపేట్, గజ్వేల్, సిరిసిల్లల్లో మాత్రం డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇచ్చారని గుర్తు చేశారు. 2024 నుంచి 2034 వరకు అధికారంలో ఉండేది కాంగ్రెస్ పార్టీనే అన్నారు. గంజాయి విక్రయాలను ప్రోత్సహిస్తూ మంత్రి, అతని సోదరుడు యువతను బానిసలుగా మారుస్తున్నారని విమర్శించారు. రోడ్లు అధ్వానంగా ఉన్నాయని దీనికి మంత్రి బాధ్యత వహించాలన్నారు.

తెలంగాణలో స్వేచ్ఛలేదు : ఎమ్మెల్యే సీతక్క
తెలంగాణ ప్రభుత్వం నియంత పాలన సాగిస్తుందని జనాలకు స్వేచ్ఛ అసలే లేదని ములుగు ఎమ్మెల్యే సీతక్క పేర్కొన్నారు. ఉద్యమాలు చేస్తే జైలులో పెడుతున్నారని ఆరోపించారు. ప్రజలకు స్వేచ్ఛ కావాలంటే ఇందిరమ్మ రాజ్యం రావాలన్నారు. అందరూ కలిసి కట్టుగా కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. బాల్కొండ నియోజకవర్గంలో గంజాయి దందా చేయిస్తున్న మంత్రి, అతని సోదరుడు అజయ్‌రెడ్డి కన్నతల్లుల కన్నీటి ప్రవాహంలో కొట్టుకుపోతారని మాజీ ప్రభుత్వ విప్ అనిల్ హెచ్చరించారు.

విద్యార్థులకు ఇబ్బందులు కలగనీయొద్దు

- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి సబితా ఇంద్రారెడ్డి

కామారెడ్డి క్రైం: పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు సమకూర్చాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సూచించారు. సోమవా రం ఆమె ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ నవీన్ మిట్టల్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో మాట్లాడారు. ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మా ట్లాడుతూ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎదురయ్యే వివిధ సమస్యల పరిష్కారం, ఒత్తిడిని జయించడం, మనోధైర్యం కల్పించడం కోసం ప్రత్యేకంగా టెలి మానస్ అనే టోల్ ఫ్రీ నెంబర్ 14416 ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఇంటర్ విద్యార్థులకు ఏవైనా సందేహాలుంటే ప్రత్యేక కంట్రోల్ రూం (040 24601010, 040 24655027)కు ఫోన్‌చేసి నివృత్తి చేసుకోవాలని సూచించారు.

38 పరీక్ష కేంద్రాలు..
జిల్లాలో 7,495 మంది విద్యార్థులు మొదటి సంవత్సరం, 6,253 మంది రెండో సంవత్సరం పరీక్షలు రాయనున్నారని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. ఇంటర్ పరీక్షల కోసం జిల్లావ్యాప్తంగా 38 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోనికి అనుమతించబోమన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పరీక్ష కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు నడపాలని నిర్ణయించామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, చంద్రమోహన్, ఇంటర్ బోర్డు నోడల్ అధికారి షేక్ సలాం, పరీక్షల విభాగం అధికారులు అజ్మల్ ఖాన్, లింగం తదితరులు పాల్గొన్నారు.



మంత్రితో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు

క్లుప్తంగా

17లోగా బీపీఈడీ పరీక్ష ఫీజు చెల్లించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బీపీఈడీ మూడో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల ఫీజు చెల్లింపు తుది గడువు ఈ నెల 17 అని కంట్రోలర్ ఎం అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో 18 వరకు చెల్లించే అవకాశం ఉంటుందన్నారు.

బీఈడీ పరీక్ష ఫీజు గడువు 20 వరకు..

బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫీజు చెల్లింపు తుది గడువు ఈ నెల 20వరకు ఉందని కంట్రోలర్ తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో 21 వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్ www.telanganauniversity.ac.in ను సంప్రదించాలని సూచించారు.

ఓపెన్ యూనివర్సిటీ పరీక్ష ఫీజు చెల్లింపునకు నేడు ఆఖరు

నిజామాబాద్ అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ తృతీయ సంవత్సరం ఐదో సెమిస్టర్ పరీక్ష ఫీజు చెల్లింపునకు గడువు ముగిసిందని రీజినల్ కో ఆర్డినేటర్ రంజిత ఒక ప్రకటనలో తెలిపారు. రూ.1000 అపరాధ రుసుంతో మంగళవారం ఫీజు చెల్లించడానికి చివరి అవకాశమన్నారు. వివరాలకు 7382929612 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సైబర్ మోసాలపై అవగాహన



ఎల్లారెడ్డిరూరల్: సైబర్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలని షీ టీం పోలీసులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. సోమవారం ఎల్లారెడ్డి మున్సిపాలిటి పరిధిలోని గండిమాసానిపేట జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు షీ టీం సభ్యులు పలు అంశాలపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రుల ఫోన్‌లకు గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ అడిగితే చెప్పవద్దన్నారు. బాలికలతో అసభ్యంగా ప్రవర్తించవద్దని, బైక్‌లు నడుపావద్దని సూచించారు. షీ టీం సభ్యులు సుప్రజ, శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు వెంకటరమణ ఉన్నారు.

చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ సమావేశంలో సర్పంచులు



దోమకొండ: హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో సోమవారం జరిగిన నేషనల్ చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ సమావేశానికి దోమకొండ సర్పంచ్ నల్లపు అంజలితో పాటు, చింతమాన్‌పల్లి సర్పంచ్ సార్ల నర్సవ్వ, ఎంపీడీవో చిన్నారెడ్డి, కార్యదర్శి రమేష్, సంఘమేశ్వర్ జీపీ కార్యదర్శి రాహుల్‌గౌడ్ హాజరయ్యారు. పాఠశాల విద్యలో పంచాయతీ రాజ్ సంస్థల పాత్ర గురించి సదస్సులో వివరించినట్లు వారు తెలిపారు. ఈ సదస్సులో దక్షిణ భారతదేశానికి చెందిన ప్రతినిధులు హాజరయ్యారన్నారు.

పేపర్ లీక్‌పై విచారణ జరపాలి



లింగంపేట: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ ఘటనపై సమగ్ర విచారణ జరిపి దోషులను తేల్చాలని టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ నిజ్జన రమేశ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన లింగంపేటలో విలేకరులతో మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. అసలు నిందితులను పట్టుకొని శిక్షించాలని డిమాండ్ చేశారు. నాయకులు రజినీకాంత్, పూల్‌సింగ్, సంజయ్, సత్యం, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బతుకులు సాగేదెలా?

- మూడు నెలలుగా అందని వేతనాలు
- ఇబ్బందులు పడుతున్న పంచాయతీ కార్మికులు
- అప్పులు చేసి కుటుంబాన్ని నెట్టుకొస్తున్న వైనం



జీతాల కోసం భిక్షాటన చేసి నిరసన తెలుపుతున్న జీపీ కార్మికులు(ఫైల్)

ఎల్లారెడ్డి: అసలే చాలీచాలని జీతాలతో పని చేసే పంచాయతీ కార్మికులు మూడు నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. వేతనాలు లేక కుటుంబం నడవని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో పని చేసే మల్టీపర్పస్ వర్కర్లకు మూడు నెలలుగా వేతనాలు అందక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన చెందుతున్నారు. వేతనాలు విడుదల కాక పోవడంతో అప్పులు చేసి కుటుంబాన్ని నెట్టుకొస్తున్నామని వాపోతున్నారు. గ్రామాల్లో వీధులు శుభ్రపర్చడం, మురికి కాలువలు తీయడం మొదలుకొని వీధి దీపాలు వేయడం, నర్సరీలోమొక్కలు పెంచడం, గ్రామాల్లో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులో వేయటం లాంటి పనులను వీరు నిర్వహిస్తుంటారు ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో 500 జనాభాకు ఒక మల్టీపర్పస్ వర్కర్‌ను జీపీ పాలకవర్గం ఏర్పాటు చేసింది. వీరికి ప్రతి నెల రూ.8500 వేతనాన్ని అందించాల్సి ఉంటుంది. మల్టీపర్పస్ వర్కర్లు గ్రామంలో చెత్తను తొలగించడం, ట్రాక్టర్ నడపడం, మురికి కాలువలను శుభ్రం చేయడం, వీధి లైట్లు అమర్చడం, తాగునీటిని వదలడం తదితర పనులన్ని చేయాల్సి ఉంటుంది. అన్ని పనులు చేస్తున్న వీరికి గత డిసెంబర్, జనవరి, ఫిబ్రవరికి సంబంధించిన మూడు నెలల వేతనాలు ఇంకా అందలేదు. జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం వీరికి వేతనాలకు సంబంధించిన నిధులను అందించక పోవడంతో జీతాలు రావడం లేదు. ప్రభుత్వం స్పందించి వేతనాలకు సంబంధించిన నిధులు విడుదల చేయాలని వారు కోరుతున్నారు.

మా బాధ అర్థం చేసుకోవాలి

మూడు నెలలుగా జీతం రాక ఇబ్బందులు పడుతున్నాం. ఒక నెల జీతం రాక పోతే సర్దుకుంటాం కానీ మూడు నెలలు రాక పోతే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలి.

– కిష్టయ్య, మల్టీపర్పస్ వర్కర్, రుద్రారం

సామాన్లు కొనేందుకు డబ్బులు లేవు

మూడు నెలలుగా జీతం రాక పోవడంతో కిరాణా సామాన్లు తెచ్చుకునేందుకు డబ్బులు లేక ఇబ్బందిగా ఉంది. చిన్న కార్మికులను దృష్టిలో ఉంచుకుని జీతం ప్రతి నెల వచ్చేలా చూడాలి.

– చరణ్, మల్టీపర్పస్ వర్కర్, బ్రాహ్మణపల్లి

ట్రెజరీకి బిల్లులు పంపించాం

మల్టీపర్పస్ వర్కర్లకు సంబంధించిన బిల్లులు ట్రెజరీ కార్యాలయానికి పంపించాం. నిధులు రాగానే వేతనాలు వారి ఖాతాల్లో జమ అవుతాయి.

– ప్రకాశ్, ఎంపీవో, ఎల్లారెడ్డి

బాబుది ప్రభుత్వ హత్యే

- పంచాయతీ కార్మికుడి మృతిపై నిరసన
- కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్



మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న దళిత శక్తి ప్రోగ్రాం సభ్యులు

బీబీపేట: పంచాయతీ కార్మికుడు కొంగరి బాబుది ముమ్మాటికి ప్రభుత్వ హత్యే అని కారోబార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దుర్గాగౌడ్ అన్నారు. బీబీపేట జీపీ కార్యాలయంలో పంచాయతీ కార్మికుడు కొంగరి బాబు ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. మృతుడి కుటుంబానికి కారోబార్ అసోసియేషన్ తరఫున రూ.పది వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం జీతాలు విడుదల చేయక పోయినా పంచాయతీ కార్మికులు వెట్టి చాకిరి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం బాబు కుటుంబానికి రూ.20 లక్షల ఆర్థిక సహాయం అందించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, డిమాండ్ చేశారు. ప్రభుత్వం జీపీ కార్మికులను చిన్న చూపు చూస్తోందన్నారు. కార్మికులు బాగుంటేనే పల్లెలు బాగుంటాయన్నారు. దళిత శక్తి ప్రోగ్రాం సభ్యులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నాయకులు సిద్దరాంలు, శివానందగౌడ్, యాదగిరి, ప్రభాకర్, శేఖర్, కొల్లురు రాజలింగం, లక్ష్మణ్, అరవింద్, పర్శరాంలు, శ్రీనివాస్, మురళి పాల్గొన్నారు.



బీబీపేటలో మాట్లాడుతున్న కారోబార్ అసోసియేషన్ సభ్యులు

అభివృద్ధి పనులను పరిశీలించిన స్పీకర్



బాన్సువాడటౌన్: మండలంలోని తాడ్కోల్‌లో సోమవారం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అభివృద్ధి పనులను పరిశీలించారు. గ్రామంలో నిర్మిస్తున్న ఎస్సీ కమ్యూనిటీ హాల్ కోసం రూ.15 లక్షలు కేటాయించారు. ముదిరాజ్ సంఘ భవనం పనులను పరిశీలించి గతంలో కేటాయించిన రూ.15 లక్షలకు మరో రూ.10 లక్షలు కేటాయించారు. రామాలయంలో గల హనుమాన్ దీక్ష స్వాముల సన్నిదానం కోసం రూ.10 లక్షలు కేటాయించారు.

చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కృష్ణహరి



కామారెడ్డి టౌన్: జాతీయ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జిల్లా కేంద్రానికి చెందిన సబ్బని కృష్ణహరి నియమితులయ్యారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.

జీపీ కార్మికుల వేతనాలు చెల్లించాలి



కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తుందని పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు సుధాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీబీపేట గ్రామ పంచాయతీ భవనంలో ఆత్మహత్య చేసుకున్న కార్మికుడి కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. తక్షణమే బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకటిగౌడ్, జిల్లా అధ్యక్షుడు బాలనర్సు, ఉపాధ్యక్షులు రాజన్న, నర్సయ్య, స్వామి తదితరులున్నారు.

ప్రజావాణికి 35 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

కామారెడ్డి క్రైం: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 35 ఫిర్యాదులు వచ్చాయి. ప్రజల నుంచి అదనపు కలెక్టర్ ఫిర్యాదులు స్వీకరించారు. ఏవో రవీందర్, అధికారులు రాజారాం, శ్రీనివాసరావు, దయానంద్, సాయి భుజంగరావు, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రీతి మరణంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

వైద్య విద్యార్థిని ప్రీతి మరణంపై అనేక అనుమానాలు ఉన్నాయనీ, ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ జిల్లాకు చెందిన లంబాడా హక్కుల పోరాట సమితి, గిరిజన విద్యార్థి సంఘం నాయకులు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఆయా సంఘాల అధ్యక్షులు నునావత్ గణేష్ నాయక్, చవాన్ వినోద్ నాయక్ మాట్లాడుతూ.. నిందితుడు సైఫ్, అతని మిత్రులు కలిసి ప్రీతికి మత్తు మందు ఇచ్చి హత్య చేసి ఉంటారనే అనుమానాలు ఉన్నాయనీ, నిజాన్ని నిగ్గు తేల్చేందుకు హైకోర్టు సిట్టింగ్ జడ్జి చేత న్యాయ విచారణ జరిపించాలని కోరారు.

వంతెనలకు మోక్షమెప్పుడో?



ముద్దోజీవాడి మార్గంలో వంతెన నిర్మించాల్సిన వాగు

- బ్రిడ్జిల నిర్మాణం లేక ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న ప్రజలు

సదాశివనగర్: వాగులపై వంతెనలు నిర్మించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ముద్దోజీవాడి, అమర్లబండ గ్రామాలకు వెళ్లే దారిలో వాగులు ఉన్నాయి. ఆయా వాగులపై వంతెనలు నిర్మించకపోవడంతో వానాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముద్దోజీవాడిలో 30 కుటుంబాలు ఉంటాయి. ఈ గ్రామానికి ఇప్పటికి మెటల్ రోడ్డు సక్రమంగా లేదు. అమర్లబండ ప్రధాన రోడ్డు నుంచి గ్రామానికి రెండు కిలోమీటర్ల మేరకు కాలినడకన వెళ్లాల్సిన దుస్థితి. వర్షాలు కురిసినప్పుడల్లా వాగు దాటడం చాలా కష్టం. ఏళ్ల తరబడి నుంచి ఈ వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని గ్రామానికి వచ్చిన అధికారులకు, నాయకులకు చెప్పినప్పటికీ ప్రయోజనం లేకుండా పోతుందని వారు పేర్కొంటున్నారు. అలాగే అమర్లబండ వాగుపై సైతం బ్రిడ్జి లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వానాకాలంలో వాగులు వస్తే ఇబ్బందులు పడతామని, ప్రస్తుతం వంతెనల నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఐదేళ్ల నుంచి చెబుతున్నారు



మా ఊరికి వెళ్లే మార్గంలో వాగు పై వంతెన నిర్మాణం అవుతుందని ఐదేళ్ల నుంచి చెబుతున్నా రు.ఇప్పటికీ పని జరిగింది లే దు. వర్షాకాలం వస్తే మా బాధ లు ఎవరికి చెప్పుకోరాకుండా ఉంటాయి. సమస్యను పరిష్కరించాలి.

– మల్లారి సంతోష్, అమర్లబండ

నిధులు కేటాయించాలి



అమర్లబండ గ్రామ వాగు వద్ద బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలి. ఎమ్మెల్యే జాజాల సురేందర్ వాగు పారుతున్న సమయంలో గ్రామానికి ట్రాక్టర్‌పై వచ్చారు. ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలే.

– గుండెల్లి రవికుమార్, అమర్లబండ

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి

డిచ్‌పల్లి: స్వయం ఉపాధి ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగాలని, కుటుంబానికి అన్ని విధాల తోడుగా నిలువాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి అన్నారు. డిచ్‌పల్లి మండలం నడిపల్లిలో స్వామి ఉమెన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (స్వార్డ్స్) ఆధ్వర్యంలో నాబార్డు సహకారంతో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి మాట్లాడుతూ.. ప్రతి మహిళా ఆర్థిక స్వావలంభన సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు. నాబార్డు సహకారంతో స్వార్డ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో డిచ్‌పల్లి, ఇందల్వాయి, ధర్పల్లి, మోపాల్ మండలాల పరిధిలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ, అల్లికలు, జూట్ బ్యాగుల తయారీలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు జడ్జి ధ్రువ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షురాలు సంపూర్ణ, నాబార్డు డీడీఎం కే నగేష్, రీజనల్ అధికారి నితిన్, నాబ్కాన్స్ జిల్లా కోఆర్డినేటర్ థామస్ మోడి, స్వార్డ్స్ సంస్థ ప్రతినిధులు గంగ నర్సయ్య, జాన్‌వెస్లీ, ప్రీతి పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలే రక్షణ

ఖలీల్‌వాడి : మహిళలకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి అన్నారు. నగరంలోని ఖానాపూర్‌లో వర్డ్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో నిర్వహించిన మహిళ దినోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. చట్టాలు మహిళలకు రక్షణగా ఉన్నాయని తెలిపారు. గృహహింస, బాల్య వివాహాలు, పని ప్రదేశాలలో మహిళలపై వేధింపులపై తోపాటు వివిధ అంశాలపై వివరించారు. వర్డ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు జ్యోతి, వర్డ్ కార్యవర్గ సభ్యుడు ఆశ నారాయణ ఉన్నారు.

క్రైం కార్నర్

కరెంట్ షాక్‌తో రైతు మృతి



శంకర్ (ఫైల్)

డిచ్‌పల్లి(మోపాల్): మోపాల్ మండలంలోని సిర్పూర్ గ్రామ శివారులో రైతు సుగంధం శంకర్ (56) సోమవారం ప్రమాదవశాత్తు కరెంట్‌షాక్ తగిలి మృతి చెందినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నిజామాబాద్ నగరం పద్మనగర్‌లో నివసించే శంకర్ సిర్పూర్ శివారులో గల తన పంట పొలానికి నీళ్లు పారించేందుకు వెళ్లాడు. బోరుమోటార్‌ను స్టార్ట్ చేయడానికి యత్నించగా.. స్టార్టర్ డబ్బాకు విద్యుత్ ప్రసరించడంతో షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. పొలం వద్దకు వెళ్లిన భర్త తిరిగి రాకపోవడం, ఫోన్ చేసినా స్పందించకపోవడంతో భార్య లక్ష్మీనర్సవ్వ అక్కడికి చేరుకున్నారు. విద్యుత్ షాక్‌తో భర్త మృతిచెంది ఉండటం గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలసదనం నుంచి ఇద్దరు బాలికల పరారీ

ఖలీల్‌వాడి: నిజామాబాద్ బాలసదనం నుంచి ఇద్దరు బాలికలు పరారీ అయినట్లు ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. అధికారులు ఇద్దరు బాలికలను షెల్టర్ కోసం బాలసదన్‌కు తరలించారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న వారు సోమవారం ఉదయం 6 గంటల నుంచి కనిపించలేదు. దీంతో వారు పారిపోయారని బాలసదనం సూపరింటెండెంట్ సునంద ఫిర్యాదు చేశారని ఎస్సై తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత



బాన్సువాడటౌన్: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని బాన్సువాడలోని తాడ్కోల్ రోడ్డు వద్ద పట్టుకున్నట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం తాడ్కోల్ చౌరస్తా వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో బిచ్కుంద వైపు నుంచి ఇసుక లోడ్‌తో వస్తున్న లారీని తనిఖీ చేశామన్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండటంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. లారీ డ్రైవర్ గడ్డవ వినయ్, యజమాని మాసాని సుదర్శన్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య



స్వప్న మృతదేహం

తాడ్వాయి: మండలంలోని దేమికలాన్ గ్రామానికి చెందిన పుట్ట స్వప్న(36) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. స్వప్న కొన్ని రోజుల నుంచి నడుము నొప్పి, కడుపు నొప్పితో బాధ పడుతోంది. ఎన్ని ఆస్పత్రుల్లో చూపెట్టుకున్నా నయం కాలేదు. దీంతో ఆదివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. స్వప్నకు భర్త రామదాస్, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కడుపునొప్పి భరించలేక ఒకరు..

నవీపేట: మండలంలోని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన గంగల్ సాయిలు(47) సోమవారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై రాజారెడ్డి తెలిపారు. సాయిలు కొంతకాలంగా కడుపు నొప్పితో బాధ పడుతున్నాడు. ఈ క్రమంలో కడుపు నొప్పి భరించలేక ఇంట్లో దూలానికి ఉరేసుకున్నాడని ఎస్సై పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఘనంగా సిద్దరామేశ్వరుడి కల్యాణం



ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను తీసుకు వస్తున్న ప్రభుత్వ విప్ గంప గోవర్దన్



భక్తులకు తాళి చూపుతున్న వేద పండితుడు

భిక్కనూరు: భిక్కనూరు సిద్దరామేశ్వరస్వామి కల్యాణం సోమవారం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా భువనేశ్వరీదేవి, పార్వతీ దేవిలతో స్వామి వారి కల్యాణం జరిపించారు. ప్రభుత్వ విప్, కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్దన్ కల్యాణానికి హాజరై పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. అర్చకులు కొడకండ్ల సిద్దగిరి శర్మ, కొండకండ్ల రామగిరిశర్మ, న్యాలకంటి రాజేశ్వరశర్మ, పూజారి సిద్దేష్, వేద బ్రాహ్మణులు గోపికృష్ణ, జగన్నాథశర్మ, సాయినిఖిల్ శర్మ శాస్త్రోక్తంగా స్వామి వారి కల్యాణం జరిపించారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ పునర్నిర్మాణకమిటీ చైర్మన్ అందె మహేందర్‌రెడ్డి, పీఠాధిపతి సదాశివమహంత్, సర్పంచ్ తున్కి వేణు, ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహరెడ్డి, ఎంపీపీ గాలిరెడ్డి, జెడ్పీటీసీ పద్మనాగభూషణంగౌడ్, ఆలయ ఈవో శ్రీధర్, ఎంపీటీసీ సరస్వతి సువర్ణప్రభాకర్, భగవంత్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, గంగ్గుల భూమయ్య, నాగార్తి భూంరెడ్డి, రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

రెండు బైక్‌లు ఢీ : ముగ్గురికి తీవ్రగాయాలు

ఒకరి పరిస్థితి విషమం



ప్రమాదంలో ధ్వంసమైన బైక్

నాగిరెడ్డిపేట: మండలంలోని గోపాల్‌పేట నుంచి లోంకలపల్లి గ్రామానికి వెళ్లే దారిలో ఆదివారం రాత్రి రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు బైక్‌లు ధ్వంసం కాగా వాటిపై ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. లింగంపేట మండలం మలపాటికి చెందిన కంపె మహేష్ వరుసకు సోదరుడైన మహేష్‌తో కలిసి బైక్‌పై గోపాల్‌పేట నుంచి తన స్వగ్రామానికి బయల్దేరాడు. అదే సమయంలో లింగంపేట మండలం శెట్పల్లి సంగారెడ్డి గ్రామానికి చెందిన కుమ్మరి చిరంజీవి తన బైక్‌పై తన స్వగ్రామం నుంచి గోపాల్‌పేటకు వెళ్తున్నాడు. నాగిరెడ్డిపేట శివారులోని పటేల్‌చెరువు వద్ద రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు బైక్‌ల ముందు భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. దీంతోపాటు బైక్‌లపై ప్రయాణిస్తున్న కంపె మహేష్, చిరంజీవి, మహేష్‌కు తీవ్రంగా గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఆస్పత్రులకు తరలించారు. కంపె మహేష్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. నాగిరెడ్డిపేట పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు.

కారు బోల్తా



బోల్తా పడిన కారు

నందిపేట్: మండలంలోని సీహెచ్ కొండూరు శివారులో సోమవారం సాయంత్రం కారు అదుపు తప్పి బోల్తా పడింది. వివరాలు ఇలా ఉన్నాయి.. మాక్లూర్ సర్పంచ్ బోయినపల్లి అశోక్ కుమార్ తన కారులో సిహెచ్ కొండూరు శివారులోని చాడేశ్వరి ఆలయంలో పూజలు చేసేందుకు వెళ్లారు. పూజలు చేసి తిరిగి వస్తుండగా గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న బైకుని తప్పించబోయి అదుపు తప్పి కారు రోడ్డు కిందకు బోల్తా పడింది. చుట్టుపక్కల వారు చూసి తీవ్ర గాయాల పాలైన అశోక్‌కుమార్‌ను అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.